## క్లుప్తంగా

### మోదీని సాగనంపండి..

కాకినాడ సిటీ: మోడీని సాగనంపండి.. దేశాన్ని కాపాడండి.. నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలు ఆగస్టు 9వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చాయి. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశంలో నాయకులు పాల్గొని ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. ఈనెల 27న జిల్లా సదస్సు కాకినాడలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కేంద్రకార్మిక సంఘాల నాయకులు తోకల ప్రసాద్, చెక్కల రాజ్‌కుమార్, జె.వెంకటేశ్వర్లు, తాళ్లూరి రాజు, కె.సత్తిరాజు, నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### ఏబీవీపీ కన్వీనర్‌గా సత్యసాయి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా ఆకుల సత్యసాయి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ జాతీయత ఊపిరిగా విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేసి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

### హెచ్‌ఎంకు వీడ్కోలు సన్మానం



హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓలు, కమిటీ సభ్యులు

కరప: గ్రామంలోని నక్కావారి ఎస్సీవీధి మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం బదిలీ అయిన హెచ్‌ఎం వడ్డి వెంకటేశ్వరరావును పేరెంట్ కమిటీ ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలుచేస్తూ, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు సేవలు మరువలేనివన్నారు. తల్లిదండ్రులు తరపున ఆమెతో పాటు ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి ఆయనను సత్కరించారు. విద్యాకమిటీ చైర్మన్ ఎం.స్వర్ణకుమారి, టీచర్ డేగల లక్ష్మి, యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమణ, ఎస్.వీర్రాఘవులు, బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఊమెన్ చాందీ మృతికి సంతాపం



మాజీ సీఎం ఊమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ: కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మరణం తీరని లోటని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగారావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఈ మేరకు సంతాప సభలో ఆయనకు నివాళులు అర్పించారు. ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పోస్టల్ పెన్షనర్ల సంఘం వార్షికోత్సవం



ఉత్సవాల్లో పాల్గొని స్వాగతం పలుకుతున్న పెన్షనర్ల నాయకులు

బాలాజీచెరువు: కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయంలో అల్ ఇండియా పోస్టల్-ఆర్‌ఎంఎస్ పెన్షనర్ల సంఘం పదో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు టి.గాలిబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన తపాలా కార్యాలయం హెడ్ పోస్ట్ మాస్టర్ టి.అమ్మిరాజు, ఎన్‌ఎఫ్‌పీ సంఘం నాయకులు పి.సాగర్, కె.ప్రసాదరావు, కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమ్మిరాజు మాట్లాడుతూ 2014 జూలై 19న వెల్లూరులో ప్రెసిడెంట్ డీకే రహతేను అధ్యక్షుడిగా, కె.రాఘవేంద్రన్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారన్నారు. అసోసియేషన్ స్థాపనతో పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అన్నారు. డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి సీహెచ్ రామరావు సభకు నాయకత్వం వహించారు. అసోసియేషన్ నాయకులు. జీవీ లక్ష్మీనారాయణ, డి.మాణిక్యాలరావు. ఎస్.త్రినాథరావు, ఎం.రామమోహనరావు, వై.కామేశ్వరరావు, పి.నాగేశ్వరరావు ఎస్.ఎస్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ నిర్మాణం చకచకా..

- చురుగ్గా కొండయ్యపాలెం ఆర్వోబీ పనులు
- ఆగస్టులో వినియోగంలోకి వచ్చే అవకాశం
- ఆర్వోబీకి మాజీ మంత్రి ముత్తా పేరు



నిర్మాణంలో తుది దశకు చేరుకున్న కొండయ్యపాలెం ఆర్వోబీ

కాకినాడ: స్థానిక కొండయ్యపాలెం రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) ఫ్లై ఓవర్ అతిత్వరలో వినియోగంలోకి రాబోతుంది. 2009లో శంకుస్థాపన చేసిన ఈ వంతెన నిర్మాణం, సాంకేతిక పరమైన ఇబ్బందులు, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తీవ్రజాప్యం జరుగుతూ వస్తోంది.

**నత్తనడకన నిర్మాణం**

కాంగ్రెస్, టీడీపీ పాలనల్లో ఆశించిన ప్రగతి లేకపోవడంతో వంతెన నిర్మాణం నత్తనడకన సాగింది. ఈ నిర్మాణానికి రూ.12 కోట్లు ప్రతిపాదించగా, భూసేకరణ, ఇతర పనులకు మరో రూ.30 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం వైఎస్సార్ బ్రిడ్జి, టూటౌన్ బ్రిడ్జి, మల్లిపూడి శ్రీరామసంజీవరావు వారధి ఉండగా, పెరిగిన ట్రాఫిక్ ఒత్తిడి దృష్ట్యా కొండయ్యపాలెం వద్ద ఈ కొత్త ఫ్లైఓవర్ ఆవశ్యకత ఏర్పడింది. ఈ నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో కలెక్టరేట్, భానుగుడి ప్రాంతాలకు వెళ్లే ప్రజలు టూటౌన్, అచ్యుతాపురం రైల్వేగేటు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**ద్వారంపూడి చొరవ**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక, వంతెన నిర్మాణ పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని భూసేకరణ మొదలైన అన్ని అంశాలపై దృష్టిపెట్టి పనులు పరుగులు పెట్టించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో నిర్మాణ పనులు ఒక కొలిక్కి వచ్చాయి. ఆ మేరకు నిర్మాణ బాధ్యతలు చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లు, జంక్షన్ అభివృద్ధికి సంబంధించి నగరపాలక సంస్థ అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఆర్వోబీకి ముత్తా పేరు**

నూతనంగా నిర్మిస్తోన్న ఫ్లై ఓవర్‌కు మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ పేరు పెట్టాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రతిపాదించారు. కాకినాడ నగర అభివృద్ధి కోసం ముత్తా చేసిన కృషికి గుర్తింపుగా రాజకీయాలకు అతీతంగా ఈ ప్రతిపాదన చేశారు.

**ఆగస్టు చివరి నాటికి పనులు పూర్తి**



ఆగస్టు చివరినాటికి ఆర్వోబీ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగరపాలక సంస్థ ద్వారా శారదాదేవి ఆలయ ప్రాంతంలో జంక్షన్ అభివృద్ధి జరుగుతోంది.

– బీవీఎస్ వర్మ, డీఈ, ఆర్‌అండ్‌బీ

# ప్రజల వద్దకే పాలన



సర్పవరంలో 'జగనన్న సురక్ష' సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం సచివాలయం-3 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు 234 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గ్రామ నాయకుడు పుల్ల చందు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే సమయంలో విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు అవసరమవుతాయని, వాటిని వెంటనే అందిందానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు వటంటీర్లపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనిని వలంటీర్లు పట్టించుకోవద్దని, వలంటీర్లకు మేమంతా అండగా ఉంటామని అన్నారు. భావనారాయణపురంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, కాలవగట్టుపై పట్టాలు ఇస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా 470 మంది అందుకున్న పట్టాలకు సంబంధించి పొజిషన్‌లను చూపాలని తహసీల్దార్ మురార్జీ, వీఆర్వోలను ఆదేశించారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు (చిన్నా), పుల్ల చందు, ఎంపీటీసీలు సూర్యచంద్ర, రాజేష్, తహసీల్దార్ మురార్జీ, డిప్యూటి తహసీల్దార్ కల్యాణ్, వీఆర్వోలు సాయి సత్యనారాయణ, పుల్ల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పూసల అనిల్, రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పంచాయతీ అధికారులు, స్థానిక నాయకులు



యండమూరులో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

**యండమూరులో ధ్రువపత్రాల పంపిణీ**

కరప: మండలంలోని యండమూరు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధికారులతో కలసి 200 మందికి సీసీఆర్సీ కార్డులు, కుల, ఆదాయ, నివాస, ఆధార్ సేవల వంటి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ మారెళ్ల శ్రీనివాస్ (శివ), వైస్ ఎంపీటీసీ బొమ్మిరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ మారెళ్ల వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, పార్టీ నాయకులు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ ఎస్‌పీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

**తూరంగి సచివాలయ పరిధిలో..**

కాకినాడ సిటీ: తూరంగి సచివాలయం-2 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గొల్లపల్లి సూర్యప్రకాశరరావు, దాట్ల సత్యనారాయణరాజు తదితరులతో పాటు అధికారులు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు.

## వలంటీర్లకు వందనం

### తలలో నాలుకలా సేవలందిస్తున్నారు



ఉప్పలంకలో లబ్ధిదారునికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ సత్యకాంత్

ఉప్పలంక వలంటీర్ సంగా సత్యకాంత్ తనకు కేటాయించిన 50 కుటుంబాల ప్రజలతో తలలో నాలుకలా ఉంటూ ఎన్నో సేవలు చేస్తున్నారు. వారి అవసరాలు గుర్తించి, ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తున్నారు. తన పరిధిలోని కాటూరి మంగమ్మకు పింఛన్ రాయించి, ఒకటో తేదీనే చేతిలో పెడుతున్నారు. మత్స్యకార భరోసా వచ్చేలా చేశారు. అమ్మ ఒడి, డ్వాక్రాలో సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు మంజూరయ్యేలా చేశారు. వలంటీర్ సత్యకాంత్ సేవలు జీవితాంతం గుర్తించుకుంటామని ఆయా కుటుంబాలవారు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

### రూ.1.98 లక్షల లబ్ధి..



ఇంతకుముందు ప్రభుత్వం ఏయే పథకాలు అమలు చేస్తున్నారో తెలిసేది కాదు. ఏదీ వచ్చేదికాదు. వలంటీర్లు వచ్చాక జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు చెప్పడమే కాకుండా, మాకు ఏ పథకాలు వర్తిస్తాయో చెప్పి, దరఖాస్తు చేయించి వచ్చేలా చేస్తున్నారు. ఇంతవరకు మాకుటుంబానికి అమ్మ ఒడిద్వారా రూ.55 వేలు, సున్నా వడ్డీగా రూ.45 వేలు, మత్స్యకార భరోసాగా రూ.40 వేలు, పింఛన్ కానుకగా రూ.28 వేలు, వైఎస్సార్ ఆసరాలో రూ.30 వేలు వెరసి రూ.1.98 లక్షలు వచ్చేలా చేశారు. సత్యకాంత్ మేలు ఎప్పటికీ మరువలేం.

– కాటూరి మంగమ్మ, ఉప్పలంక

### కుటుంబంలో ఓ సభ్యురాలిగా..



సురక్ష పథకంలో వివరాలు నమోదు చేసుకుంటున్న వలంటీర్ స్వర్ణలత

కాకినాడ 9వ డివిజన్ సీతారామనగర్ ప్రాంతానికి చెందిన వలంటీర్ చిర్రా స్వర్ణలత తన పరిధిలోని కుటుంబాలతో మమేకమై సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వపరంగా వచ్చే పింఛన్లు, పథకాలతో పాటు ఎటువంటి సమస్యలు ఉన్నా ఓ కుటుంబ సభ్యురాలిగా అండగా నిలుస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సాధనాల గోవిందు అనే 62 ఏళ్ల వృద్ధుడికి అన్నింటికి తానే ఆసరాగా నిలచి పింఛన్ ఇప్పించారు. పిల్లలు ఎవ్వరూ ఆ కుటుంబానికి సహాయంగా లేని పరిస్థితుల్లో అతడి పేరిట బియ్యంకార్డు మంజూరు చేయించి, పింఛన్ ఇప్పించి ఆమె భార్య పేరిట ఇంటి స్థలం, చేయూత కూడా అందించారు. ఇలాంటి మరెన్నో సేవల ద్వారా ఆమె ప్రజల మన్ననలు అందుకున్నారు.

### కూతురిలా సేవలు..



వయసు మీరి వృద్ధాప్యంలో ఉన్న నాకు, నా భార్యకు వలంటీర్ స్వర్ణలత కూతురిలా, మనవరాలి అండగా నిలబడింది. తనవల్లే పింఛన్ పొందాను. నా భార్యకు వైఎస్సార్ ఆసరా వచ్చింది. ఉండేందుకు ఓ స్థలం కూడా మంజూరైంది. మాతో ఆమెకు ఎలాంటి బంధం లేకపోయినా వలంటీర్‌గా మా కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలబడింది.

– సాధనాల గోవిందు, పింఛన్‌దారు, కాకినాడ

# సరదాకు బోటు ఎక్కి... బాలుడి గల్లంతు

- మరో ఇద్దరిని కాపాడిన మత్స్యకారులు
- ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి..



లాంజిపల్లి కృష్ణ (ఫైల్)

కాకినాడ రూరల్: సముద్ర తీరం వద్ద లంగరు వేసిన చిన్న బోటును సహచరులతో ఎక్కి ఒక బాలుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప గ్రామానికి చెందిన 16 ఏళ్ల లాంజిపల్లి కృష్ణ తన స్నేహితులు నక్కపల్లి వీరబాబు(12), మహంకాళి వీరబాబు(11)లతో మంగళవారం ఇంటి వద్ద చెప్పకుండా కరప నుంచి సూర్యారావు పేట బీచ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వాకలపూడి బీచ్‌లోని శిల్పారామానికి వెళ్లి వెనుక సముద్రం నీళ్లలో లంగరు వేసి ఉన్న బోటు ఎక్కారు. ఇంతలో బోటు సముద్రంలోకి కదిలిపోయింది. దీంతో కృష్ణ కంగారు పడి దూకేశాడు. మిగిలిన ఇద్దరు భయపడి కేకలు వేయడంతో సమీపంలోని మత్స్యకారులు వచ్చి వారిని కాపాడి తిమ్మాపురం పోలీసులకు అప్పగించగా వరిద్దరినీ మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా ఆ బాలురు కృష్ణ వివరాలను పోలీసులకు వెల్లడించలేదు. రాత్రి అవుతున్నా కృష్ణ ఇంటికి రాకపోవడంతో అతని తల్లి వరలక్ష్మి ఆందోళనకు గురై ఆ బాలురు ఇద్దరినీ విచారించడంతో అసలు విషయం బయటపెట్టారు. వెంటనే ఆమె సర్పవరం పోలీసులను ఆశ్రయించింది. సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి, గల్లంతైన బాలుడి కోసం బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు.



కృష్ణ గల్లంతుపై బాలుర నుంచి వివరాలు సేకరిస్తున్న హెచ్‌సీ రామచంద్రరావు

# దాత ఆశయాలను కొనసాగించాలి



కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

బోట్‌క్లబ్: దాత ఆశయాలను కొనసాగించాలని రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బచ్చు రామేశం సత్రం వ్యవస్థాపకులు బచ్చు రామేశం 123వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు ముందు చూపుతో వారి ఆస్తులను సైతం సత్రాలకు రాసి ఇచ్చారన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు పాలక వర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం ఉచిత హోమియో క్లినిక్, పీఆర్ గవర్నమెంట్ స్కూల్ చదువుతున్న విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, నిరుపేదలకు దుప్పట్లు, చీరలు, ఉచిత కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, సుంకర విద్యాసాగర్, సత్రం చైర్మన్ పైండా రామకృష్ణారావు పాల్గొన్నారు.

### కళ్యాణ వెంకటేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం భావనారాయణపురం తిరుమలనగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, అర్చకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. పుల్ల చందు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఎంపీటీసీలు సూర్యచంద్ర, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు

- ఆర్టీసీ డీఎం మనోహర్



కాకినాడ: ఆర్టీసీ ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. డిపో కార్యాలయంలో బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. 13 మంది ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు వివరించి, పలు సూచనలు ఇచ్చారు. పిఠాపురం-సామర్లకోట మధ్య బస్సులు నడపాలని, భానుగుడి వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని, సామర్లకోట, పెద్దాపురం నుంచి రాజహేంద్రవరానికి లిమిటెడ్ హాల్ట్స్ బస్సులు ఏర్పాటు చేయాలని మరికొందరు ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. బస్సులలో వికలాంగుల సీట్లను వారికే కేటాయించేలా చూడాలని కోరారు. రాజహేంద్రవరం-ఉప్పాడ బస్సులు నడపాలని కోరారు. కాకినాడ వైఎస్సార్ బ్రిడ్జి దగ్గర బస్సులు ఆగేలా చూడాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. కాకినాడ నగరంలో ఎయిర్ హార్న్ మోగకుండా చూడాలని, ధర్మవరం నంది సెంటర్ వద్ద టైమింగ్స్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పిఠాపురం-కోనపాపపేట మధ్య బస్సు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. కాకినాడ మాధవపట్నం మధ్య ఇన్‌కమ్ టాక్స్ కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేసి అన్ని ఆర్డినరీ బస్సులు ఆగేలా చూడాలని, కాకినాడ-వాకపల్లి బస్సులు సింహాద్రిపురం వరకు పొడిగించాలని సూచించారు. ఆయా సమస్యలపై డిపో మేనేజర్ మనోహర్ స్పందిస్తూ సమస్యలను సాధ్యాసాధ్యాలను బట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తాగునీటి సమస్య తీవ్రతరం



ఫిల్టర్ బెడ్ పనితనంలో లోపాన్ని గుర్తించి పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

- పది రోజులుగా తూరంగి వాసుల తిప్పలు
- సమస్య గుర్తింపులో అధికారులు విఫలం
- పైప్‌లైన్లు జామ్ అయ్యి ఉంటాయని సందేహం

కాకినాడ సిటీ: తూరంగి పంచాయతీలో పది రోజులుగా ప్రజలు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం విడుదల చేసే నీటిపైనే ఈ పంచాయతీ పరిధిలోని పగడాలపేట, డ్రైవర్స్‌కాలనీ, అల్లూరి సీతారామరాజుకాలనీ, విముక్తికాలనీ, రాఘవేంద్రపురం, శివకృష్ణాకాలనీ, సత్యదుర్గానగర్, బుల్లబ్బాయిరెడ్డికాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా, మూడు రోజులుగా వాటి యజమానులు ఆ నీటినీ నిలిపివేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం తాగునీటిని శుద్ధి చేసే పైప్‌లైన్లలో ఎక్కడో జామ్ అయ్యిందని, అందువల్లే ఈ సమస్య ఎదురైందని చెప్తున్నారు. తూరంగితో పాటు కరప మండలం ఉప్పలంకలో కూడా తాగునీరు రావడంలేదు. తూరంగిలో మూడు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండడం రెండు ట్యాంకులకు బోర్లు ఉండడంతో వాటిలో నీటిని నింపి ఆయా కాలనీలకు నీరు సరఫరా చేస్తున్నామని కార్యదర్శి చెప్తున్నారు.

**ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పరిశీలన**

ఇదిలా ఉండగా బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, ఈఈ చౌదరి, ఏఈ మారుతీరామ్ తాగునీరు సరఫరా చేసే ప్లాంట్‌ను తనిఖీ చేశారు. నీరు రాకపోవడానికి కారణాలను పరిశీలించి గొట్టాల్లో ఎక్కడో జామ్ అయ్యిందని, ఇప్పటి వరకు ఎందుకు నీరు పూర్తి స్థాయిలో ఓవర్ హెడ్ ట్యాంకర్లకు అందడంలేదో తెలియడం లేదంటున్నారు. సమస్యను పరిశీలించి పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఎస్ఈ శ్రీనివాస్ వివరించారు.

### ఓటర్ల జాబితా పరిశీలనకు సంసిద్ధం కావాలి

ఆర్డీవో సత్యనారాయణ



అధికారులతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఓటర్ల జాబితా పరిశీలనకు ఎన్నికల పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులు సిద్ధం కావాలని రూరల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా పరిశీలనకు బీఎల్‌ఓలతో రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఆర్డీవో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు నెలరోజుల పాటు సాగే. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ 2024కు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎన్నికల పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి ఓటర్ల జాబితా సంసిద్ధం చేసుకోవాలన్నారు. రోజు వారీ ప్రణాళికతో నిర్ణీత గడువులో ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని, ఇందుకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ వీరవల్లి మురార్జీ, కరప తహసీల్దార్. పొన్నమండ శ్రీనివాసరావు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైనులు తదితరులు పాల్గొన్నారు.